క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా



నరసింహను సన్మానిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయలపై ఉందని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. సోమవారం కొత్తపేట డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన ప్రధానోపాధ్యాయులుగా నియమితులైన నరసింహ కొత్తపేట కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ.. కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, తిరుమల్, లావణ్య, శ్రీనివాస్, మోతిలాల్, రవినాయక్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



పద్మావతినగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్త

వనస్థలిపురం: ఎల్‌బీనగర్, హయత్‌నగర్ సర్కిళ్ల పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. రహదారులు, రోడ్ల పక్కనే గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోతోంది. చెత్తను రోడ్ల వెంబడి వేయడంలో వేస్తుండటంతో దుర్గంధంగా మారుతోంది. పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలిలించాల్సి సిబ్బంది వాటిని తరలించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

26 నుంచి అన్నప్రసాద వితరణ

మన్సూరాబాద్: ప్రసన్నప్రియ అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఈనెల 26 నుంచి అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ కమిటీ నేతలు తెలిపారు. ఈ నెల 26 నుంచి డిసెంబర్ 27వ తేదీ వరకు అయ్యప్ప స్వాములకు నిత్యఅన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

కుట్టు మిషన్ల అందజేత



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సూచించారు. సోమవారం అజంపురాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అయన ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే వారి కుటుంబాలకు చేయూతగా ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాగోలు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన చకిలన్ గోపాల్(62) తన కూతురు డెలివరీ కోసం డాక్టర్ కాలనీలో ఉన్న అంకుర్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. ఆదివారం రాత్రి గోపాల్ ఎన్టీఆర్‌నగర్‌లో టిఫిన్ చేసి రోడ్డు అవతలి వైపు ఉన్న హాస్పిటల్‌కు వెళ్లేందుకు రోడ్డు దాడుతుండగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఎల్‌బీనగర్ వైపు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు గోపాల్‌ఢీ కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురంలోని రైతుబజారులలో కూరగాయల ధరలు .. టమాట 23, వంకాయ 45, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకర 30, బీర 45, క్యాబేజి 20, ఫ్రెంచి బీన్స్ 55, క్యారెట్ 55, దొండ 35-40, చిక్కుడు 55, గోకర 65, బీట్‌రూట్ 43, క్యాప్సికం 55, ఆలు 23, దోస 18, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 23. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అధ్వానంగా రోడ్లు..

ప్రయాణానికి పాట్లు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

- గుంతలమయంగా రహదారులు
- మరమ్మతు చేయాలంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా హయత్‌నగర్- ఇంజాపూర్ లింక్ రోడ్డు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలతో పాటు ప్రధాన రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయి.రోడ్లకు మరమ్మతు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులతో మొర పెట్టుకున్న పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.అటుగా వెళ్లాలంటే సాహసం చేయాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయంగా మారిన రోడ్ల కారణంగా వాహనాలు ధ్వంసమవుతున్నాయని ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

శివారు కాలనీల్లోనూ..

నియోజకవర్గంలలోని శివారు కాలనీల్లోని రోడ్లు మరింతా అధ్వానంగా మారాయి. శివారు కాలనీల్లో చాలా వారకు మట్టి రోడ్లే ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో మట్టి రోడ్లన్నీ కోసుకుపోయాయి. బురదమయంగా మారడంతో ఇళ్లలో నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొందని ఆయా కాలనీలవాసులు వాపోతున్నారు. నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలో సీసీ, బీటీ రోడ్లు ఉన్నా స్థానికులకు ఇబ్బందులు తప్పటం లేదు. సీసీ, బీటీ రోడ్లలో గుంతలు ఏర్పడి వాటికి మరమ్మతు చేపట్టాల్సిన అధికారులు పట్టించకోకుండా నిర్లక్ష్యం వహించడంతో అవి పూర్తిగా ధ్వంసం అవుతన్నాయి.

జాతీయ రహదారి విస్తరణలో జాప్యం..

ఎల్‌బీనగర్ నుంచి మల్కాపురి వరకు జతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతకుంట నుంచి హయత్‌నగర్ మధ్య జాతీయ రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి పనుల కారణంగా అటుగా వెళ్లలేక కాలనీల నుంచి వెళ్దామంటే అంతర్గత రోడ్లు సైతం ధ్వంసం కావడంతో నానా కష్టాలు పడుతూ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు.

వారం రోజుల్లో మరమ్మతు చేస్తాం

ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేస్తున్నారు. సర్కిళ్ల వారీగా గుంతలుగా మారిన రోడ్లను గుర్తించిన వాటికి మరమ్మతు చేస్తాం. అధ్వానంగా మారిన రోడ్ల స్థానంలో నూతనంగా వేస్తాం. వారం రోజుల్లో అన్ని రోడ్లకు మరమ్మతు చేస్తాం.

అశోక్‌రెడ్డి, ఎస్‌ఈ



సుష్మ వద్ద గుంతలమయంగా రోడ్డు



కంకర తేలిన రైతుబజార్ నుంచి సుష్మా వరకు ఉన్న రోడ్డు



నాగోలులో ఏర్పడిన గుంతల్లో చేరిన నీరు

ఓట్ చోరీపై దేశవ్యాప్తంగా యుద్ధం



అవగాహన కల్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ఓటర్ల జాబితాలో జరుగుతున్న అక్రమాలకు సంబంధిత అధికారులు బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఆదేశానుసారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌లో సోమవారం పలు కాలనీలలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తొలగించిన అర్హుల ఓట్ల నమోదు, ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందే ఫొటోలతో కూడిన జాబితాను బహిరంగ పర్చాలన్నారు. ఓట్ చోరీపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ యుద్ధం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైదులు, లింగస్వామిగౌడ్, ఎల్లన్న, రామకృష్ణ గౌడ్, రఘు, రాజు, రేణుక, సంతోష పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం



రహదారి పనులు ప్రారంభించిన కార్పొరేటర్

సైదాబాద్: డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు బస్తీల్లోని అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం సైదాబాద్ లోకాయుక్త కాలనీలో రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను ఆమె సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సైదాబాద్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సైదాబాద్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులు పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాల్లోనూ రహదారులను ఆధునీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, కాలనీవాసులు మహిపాల్‌రెడ్డి, సుభాషిణి, హైమావతి, దేశపాండే పాల్గొన్నారు.

12న పద్మశాలి సంఘం దసరా మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమర్తపు మురళి, పున్న గణేష్‌నేత

నాగోలు: పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఆటోనగర్‌లోని హరిణవనస్థలి ఆవరణలో ఉన్న అనన్య ఎకోపార్క్‌లో 23 వ పద్మశాలి దసరా మేళా నిర్వహిస్తున్నట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. సోమవారం పున్న గణేష్‌నేత అధ్యక్షతన కొత్తపేటలో పద్మశాలి సంఘం ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దసరా మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి, రాష్ట్ర పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు గుంటక రూపా సదాశివ్ మాట్లాడుతూ.. గత 22 సంవత్సరాలుగా పద్మశాలి సమాజ అభ్యున్నతికి కోసం మేళాను నిర్వహిస్తున్నామని ఈ మేళాలో పద్మశాలి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించుకోవడంతో పాటు ప్రముఖుల సంక్షిప్త సందేశాలు, చేనేత కళాకారులకు సన్మానాలు ఉంటాయన్నారు. 23వ దసరా మేళా చైర్మన్ కొకుంట్ల రవితేజ మాట్లాడుతూ.. ఈ మేళాలో రాష్ట్రంలోని అన్ని జిల్లాకు చెందిన పద్మశాలి సంఘం అధ్యక్షులు, సంఘం నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, శ్రావణ్, లక్ష్మీనారాయణ, సుదర్శన్, స్వప్న, రేఖా, రమాదేవి, సుజాత, భారతమ్మ, విశ్వేశ్వర్, తలాటి రమేష్, జెల్లా జగన్నాథం, పడాల రవీందర్, పాల్గొన్నారు.

రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి



అల్మాస్‌గూడలోని మెయిన్ రోడ్డును పరిశీలిస్తున్న మల్లారెడ్డి

బడంగ్‌పేట్: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయని, అధికారులతో మాట్లాడి మరమ్మతులకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వెళ్లే ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ధ్వంసమై రోడ్లపై మురుగునీరు పొంగి పొర్లుతుండడంతో కాలనీవాసులతో ఆయన పరిశీలించారు. 24, 26 డివిజన్‌లలోని విశాఖనగర్-3, శ్రీసాయి హోమ్స్, వెంకటేశ్వరకాలనీ తదితర కాలనీల్లో డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం కమిషనర్ పి.సరస్వతితో మాట్లాడారు. కాలనీల్లో త్వరలో సమస్యలు పరిష్కారించేలా కృషి చూస్తామని హామీ ఇచ్చినట్లు మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గోలి రంజిత్‌రెడ్డి, కాలనీవాసులు రూపచారి, సందీప్‌రెడ్డి, చెవుల శ్రీను, రాజశేఖర్, గాంధీనాయక్, రాజు తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పించడంలో విఫలం

మలక్‌పేట: ఎస్సీ, ఎస్టీలకు చట్టాలు, పౌర హక్కులపై అవగాహన కల్పించడానికి చేపట్టిన పౌరహక్కుల అవగాహన సదస్సులు వెలవెలబోతున్నాయి. మండల పరిధిలో ఎస్సీ, ఎస్టీలు నివాసముంటున్న ప్రాంతాలు, మురికివాడలలో ప్రతీ నెల చివరి రోజున నిర్వహించే సదస్సులకు జనాన్ని సమీకరించడంలో అధికారులు, ఆ వర్గాల నాయకులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుల వివక్షత, అంటరానితనం, సామాజిక సమస్యల నివారణకు పౌరులు వారి హక్కులు తెలుసుకుని చట్టాల ద్వారా న్యాయం పొందడానికి సదస్సులు దోహదపడాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చింది. ఆ లక్ష్య సాధనవైపు అడుగులు పడటం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పని ఒత్తిడో, లేదా ఎస్సీ, ఎస్టీలు అని చిన్నచూపో తెలియదు కానీ.. ఆయా శాఖల పైస్థాయి అధికారులు కూడా తమశాఖ నుంచి ప్రతినిధిగా సిబ్బందిని పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో వారి సమస్యలు తెలుసుకుని, వారికి చట్టాలపై భరోసా కల్పించడం లేదని, పేరుకు మాత్రం సదస్సు పెట్టి ఫొటోలకు ఫోజులిచ్చి చేతులు దులుపుకుంటున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా

సైదాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా మక్కువ చూపాలని శ్రీత్రివేణీ ఉన్నత పాఠశాల డైరెక్టర్ కె.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గత నెల 25- 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాఠశాల విద్యార్థి ఎన్.చరణ్ ప్రతిభ కనబరిచాడు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చరణ్‌ను అభినందించారు.

తలసానికి సన్మానం



నాంపల్లి: రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌ఛార్జ్ సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ హయాంలోనే నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నలుమూలలా కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మాజీ మంత్రి తలసాని నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి పదేళ్ల పాటు అండగా ఉండి ప్రజలకు ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు.

బైక్‌లు గాయబ్.!

అంబర్‌పేట: ఇంటి ముందు పార్క్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన సోమవారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బాగ్‌అంబర్‌పేట మల్లికార్జున్‌నగర్‌లో నివసించే యాదగిరి, నర్సింహులు వారి ఇంటి ముందు అక్టీవా ద్విచక్రవాహనాలను పార్క్ చేసి నిద్రపోయారు. ఉదయం లేచి చూసే సరికి అవి కనిపించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరదకాలువ విస్తరణకు చర్యలు



మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: శివగంగా థియేటర్ వద్ద ఉన్న వరద కాలువ ప్రవాహానికి అనుగుణంగా విస్తరణ చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశించారు. లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్కుకాలనీలో గత కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ మురుగు రోడ్లపై పారుతుందని ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన కాలనీలో పర్యటించిన అనంతరం మాట్లాడారు. గ్రీన్‌పార్కుకాలనీ, సింగరేణికాలనీల మధ్యనున్న ఎస్ఎన్‌డీపీ నాలాలో ఉన్న వాటర్ పైపులైన్లు, డ్రైనేజీ లైన్లను వెంటనే తొలగించాలన్నారు. మెగా ఫంక్షన్ హాల్ నుంచి వచ్చే మురుగు ప్రవాహాన్ని దారి మళ్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చార్మినార్, ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులను ఆదేశించారు. నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలన్నారు. వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహేష్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, బలరాంరాజు, మాధవిలత, కార్తిక్, విజయ్, నాయకులు వరప్రసాద్‌రెడ్డి, తిలక్ రావు, రాకేష్, అశీష్, అనిల్, ప్రకాష్, ఇంద్రజీ, శ్రీకాంత్, అరుణ్, యశ్వంత్ కాలనీలవాసులు జగన్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తొక్కిసలాటలో ప్రాణాలు పోగొట్టుకోకండి

ప్రజలకు అవగాహన కార్యక్రమాలు

నాగోలు: సినిమాల విడుదల, రాజకీయ నాయకుల సభల సందర్భంగా జరుగుతున్న తొక్కిసలాటల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ ప్రజలకు అవగాహన కలిస్తున్నట్లు నాగోలు పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. తొక్కిసలాట సమయంలో ఎలా ప్రవర్తించాలో, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు ప్రారంభించినట్లు వారు తెలిపారు. యువత, అభిమాన సంఘ సభ్యులు ఈ సూచనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. సినిమా కోసం, లేదా ఓ నాయకుడి సభ కోసం ప్రాణాలను పణంగా పెట్టడం సరికాదన్నారు. ఎవరికోసం ఆరాటపడుతూ అమూల్యమైన ప్రాణాలను కోల్పోవడం కన్నా జాగ్రత్తగా ఉండటం మేలని సూచించారు. పోలీసులు సామాజిక మాధ్యమాల ద్వారా, పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజల్లో జాగ్రత్తే ప్రాణరక్షణ అనే సందేశాన్ని ఇస్తున్నారు.

శ్రమను ఆయుధంగా మార్చుకుంటే విజయం సొంతం



శాంతన్‌కుమార్‌రెడ్డి సన్మానిస్తున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: గ్రూప్-1 ఫలితాల్లో 30వ ర్యాంక్ సాధించి డీఎస్పీ గా ఎంపికైన బుసిరెడ్డి శాంతన్‌కుమార్ రెడ్డి సోమవారం ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలుక నరసింహా రెడ్డి, నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న బుసిరెడ్డి రవీందర్‌రెడ్డి కుమారుడు శాంతన్ డీఎస్పీగా ఎంపికగా కావడం సంతోషదాయకమన్నారు. యువత శ్రమను ఆయుధంగా మార్చుకుంటే విజయం సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్, సైదులు, లింగాస్వామి గౌడ్, రమేష్, ప్రభాకర్, కృష్ణమోహన్, రామకృష్ణగౌడ్, రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, రఘు, పగడాల ఎల్లన్న పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ అభివృద్ధికి కృషి చేస్తా

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



బొడ్రాయికి పూజలు చేస్తున్న సబితారెడ్డి, గ్రామస్తులు

బడంగ్‌పేట్: సుల్తాన్‌పూర్‌లో నెలకొన్న సమస్యలు త్వరితగతిన పూర్తి చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్ 13వ డివిజన్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బొడ్రాయికి స్థానికులతో కలిసి పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులన్నీ త్వరలో పూర్తి చేయిస్తానని స్పష్టం చేశారు. డ్రైనేజీ సమస్యను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొర్ర జగన్ రెడ్డి, కై సర్‌బాష్, శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మహ్మద్ అఖిల్, బొర్ర మాధవరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365